
# అత్తగారిలో అమ్మ

దోర్నాదుల సుబ్బమ్మ



మనుషుల్లో ఎన్నెన్నో రకాలు... అవయవ లోపంతో కొందరు, అవగాహన లోపంతో మరి కొందరు, నిజం మాట్లాడేవారు, అబద్ధాల్ని జో డించేవారు, స్వార్థపరులు, త్యాగధనులు, బాధ్య తల్ని తప్పించుకొనేవారు, బాధ్యతల్ని మోసేవా రు, తమని తాము సమర్థించుకొంటూ యితరు ల్ని వేలెత్తి చూపేవారు, క్రూరులు, దుర్మార్గులు, అందరికీ చోటిస్తుందీ లోకం... పాడు లోకం...!

నాణేనికి బొమ్మ, బొరుసు ఉన్నట్టే మనిషి బుద్ధికి కూడా మంచీ చెడూ వుంటాయి.

వంటింట్లో జారిపడిన అమ్మను వృద్ధాప్యం మంచానికే పరిమితం చేసింది. అప్పటికి తాగు బోతు భర్త శాశ్వతంగా దూరమై పదేళ్లయింది. ఇద్దరు కొడుకుల్ని ఆఫీసర్లను చేసి, పెళ్లిళ్లు చేసిం ది. కూతుర్ని మంచి సంబంధానికే యిచ్చింది. వాళ్ల కంటే పదేళ్ల వెనుక రాముడు పుట్టాడు.

అమ్మ కొంగుపట్టుకు తిరుగుతూ పెరిగాడు. వీడు మీ యంతటి వాడవుతాడో లేదో... వీణ్ణి దగ్గరుంచుకొని శ్రద్ధగా చదివించండ్రా... అం టే, 'నీ గారాబంతో వాడిట్టా తయారైనాడు, వాణ్ణి మేమేం చెయ్యలేం... నీ దగ్గరతప్ప యింకె క్కడా నిలవడు వాడు...' అని యిద్దరు కొడుకు లూ తేల్చేసారు. లోలోపల వాళ్ల మాటలకు బాధపడిందేగానీ పైకి కన్పడనిచ్చేది కాదు.

కొన్ని బాధల్ని, ప్రేమల్నీ బైటికి రానీకుండా వుండడమే మంచిది...! రెండుపదుల వయసొ చ్చింది రాముడికి. తల్లినంటిపెట్టుకోనుండేట్టు గా కాలం నిర్ణయించింది.

రాముడికి అమ్మ చంటి బిడ్డయింది.

'నా కోసం నువ్విట్టా వుండిపోతే ఎట్టాగ రా... నువ్వూ... ఓ యింటోడివి కావాల్రా... నీ గురించి ఆలోచిస్తే ఏదోగా వుంటుందిరా... నాకోసం నిన్నిట్టా బతకనిస్తే, బావుండదు...'

'నిన్నిట్టా వొదిలేస్తే దేవుడైనా మెచ్చుతాడా మ్మా...' అంటున్న రాముణ్ణి చూడ్డంతోనే కళ్ల లోకి నీళ్లొచ్చాయి ఆమెకు. తల్లీ కొడుకుల మధ్య అటువంటి సందర్భాలెన్నోసార్లొచ్చాయి.

తనని చూసి, ఒక్కొక్కరూ ఒక్కో రకంగా మాట్లాడుకోవడం వినీ విన్పడ్డట్టున్నా అర్థమయ్యే ది రాముడికి. తనలో తనే నవ్వుకొనేవాడు. పరిహాసించినా పట్టించుకోకపోవడం జ్ఞానికున్న ఓ లక్షణం!

'తల్లికి సేవ చెయ్యడం... అందుకోసం జీవి తాన్ని త్యాగం చెయ్యడం తప్పవుతుందా? కానే కాదు...' అనుకొంటున్నపుడే తెలీకుండానే మన సులో ముల్లు గుచ్చుకున్నట్టనిపించేది.

ముళ్లున్నా... రాళ్లున్నా నలుగురూ నడిచే దారిలోనే నడవాల్నా? బాగున్న మరో దారిన నడవడం లోక విరుద్ధమా?

'ఏరా రాముడూ... ఎన్నాళ్లిట్టా మీ అమ్మ కోసం వుండిపోతావురా... నీ దంటూ ఓ దారీ తెన్నూ వుండాలగదరా...'

'నువ్వే సేవ చెయ్యాల్నా మీయమ్మకి?... మీ అన్నల్నడిగి డబ్బు తీసుకుని మనిషిని పెట్టి చెయ్యించరా...'

'ఆడోళ్లకి ఆడోళ్లే పనులుచేస్తే బాగుంటది గదా...'

'నువ్వు జూస్కుంటుండావని, నీ అన్నలు సరిపెట్టుకొన్నారు...'

అలా ఒక్కొక్కరు ఒక్కోరకంగా, దారినపో యే రాముణ్ణి నిలేసి ఎన్నెన్నో అడిగేవాళ్లు... ఆడ, మగ భేదం లేకుండా.

రాముడు బాధపడ్తూ మౌనంగా చూసేవాడే కానీ మరో మాట మాట్లాడేవాడు కాదు.

ఎదుటివాళ్లని ఏడిపించడంలో ఏమొస్తుం

ది? నా బాగు నాకు తెలుసు... మీ సలహా, సానుభూతి నాకక్కర్లేదు – అని చెప్పాలని, అందరి నోళ్లూ మూయించాలన్పించేది రాముడికి. కానీ ఏదీచేయలేని, చెప్పలేని అసహాయతో... లేక వాళ్ల మాటల్ని ఖాతరు చెయ్యని ధిక్కారతో... నవ్వి సరిపెట్టేవాడు మరి...!

ఓ రోజు రాముడు వినేట్టుగానే, 'చలంలో నీళ్లూరుతున్నాయా? నీకు తెలుసా ఆ సంగతి?' అడిగింది అత్తవరసైనామె...

'నాకు తెలీదత్తా' అనడంతో పక్కనున్నవాళ్ల నవ్వేసారు. అత్తమాటలో ఏదో అంతరార్థం వుంటేనే వాళ్లలా నవ్వారనేది మనసుకి రాగానే ఏదో బాధ క్రుంగదీసినంత పన్జేసింది.

బాధ ఒక్కసారి చావుదగ్గరికి నెట్టుంటుంది. రోజూ తన గురించి మాటలాడే మాటలు విన్నాక... తనకేమనిపించే అన్నీ వివరంగా అమ్మకు చెప్పాలని దగ్గర కూర్చున్నాడు.

'ఒరే రావుడూ... చెట్టుకాయ పండినాక ఏమవుద్దిరా...' అని అమ్మనడం, 'రాలిపోతుంది కదమ్మా...' అని చెప్పడం ఒకేసారి జరిగింది.

'పక్వంలో వున్నపుడే కోసుకొని తినాలిరా... మనిషి కూడా అంతే... వయసులో వున్నపుడే నువ్వూ ఓ యింటోడివి కావాల్రా... తాడూ బొంగరం లాగే రెండూవుంటేనే ఆట సాగుద్ది...'

'అమ్మా...'

'నువ్వు చెప్పేవన్నీ మళ్లీ చెప్దువుగాని, కానీ ఊరి ముందర మన చెట్టు పక్కన దిబ్బవుంది గదా... ఆ దిబ్బ మీదుండే పూరింట్లో యెంకటమ్మను పిల్చుకురా... వచ్చేప్పుడు పెద్దకూతురు సుజాతని తీసుకురమ్మను. ఎప్పుడో చిన్నప్పుడు గౌన్లేసుకొన్నప్పుడు జూసినా. మొగపిల్లోడి కోసం నలుగురాడపిల్లల్ని కన్నది ఆ యెంకటమ్మ. మానవతి గాబట్టి ఆ మొగుడితో కాపురం జేస్తా వుంది. ఆడమనిషిలోనే కాపురం గుట్టూ మట్టూ వుండేది! మన పనీ పాట కొచ్చేది యింతకు ముందు మనం పొలం చేయించుకొనేప్పుడు. తనేదో మాటాడాలనుకొని అమ్మ దగ్గర కూర్చున్న రాముడు మాటాడలేదు.

'మాయింటికోసారొస్తే మంచి స్వీటు బెట్తా మావా...' అంది మేనకోడలు వరసైన సులోచన.

'బావా... బావా... అని నేను పిలవడమేగా నీ... మీ బావలో గొప్పతనం ఏంది అంటున్నారు బావా... నీ గొప్ప చూపించవూ' అంది మరదలు వరసైన నాగమణి.

'ఎంత నవ్వినా, ఎంత కవ్వించినా... మాను... మానే... ఆ 'రోకు' లేనోణ్ణి ఏపుకు తింటారెందుకే...' అంది పెద్దమ్మ వరసైన లక్ష్మమ్మ.

తన పక్షంలో మాట్టాడినట్టు, వాళ్లని దండించినట్టున్నా ఎక్కడో గునపంతో గుచ్చినంతగా అదిరిపడ్డాడు, గిలగిల్లాడాడు.

నేను మగాణ్ణి కాదని తేల్చుకొని నన్నిట్టా మాటాడుతున్నారు కాబోలు... అనుకోగానే వొళ్లంతా తేళ్లూ జెర్రులూ పాకినంత పనైంది.

తెల్లారి అమ్మ పిలవమన్న యెంకటమ్మని, సుజాతనీ వెంటబెట్టుకొచ్చాడు రాముడు.

సుజాతను చూస్తూనే 'ఎంత ఎదిగిపొయ్యావే సుజాతా... ఓ సారి చూద్దామని రమ్మన్నాను... కూచోండి...' అంది.

కుర్చీలను జరిపి క్రింద కూర్చున్నారిద్దరూ. 'అయ్యో... క్రింద కూర్చున్నారే...' అన్నాడు రాముడు.

'పెద్దామెముందు కింద కూచ్చుంటే తప్పా?




తక్కువై పోతామా?' అందుకొంది సుజాత.

'ఏదైనా సదూకొంటున్నావా? పని జేస్తావుం దావా?'

'ఇంటర్‌మీడియేట్‌తో ఆపేసానమ్మా. ఖాళీ గానే ఉన్నానిప్పుడు...'

'పిల్లకెప్పుడు పెళ్లిచేస్తావ్ వెంకటమ్మా... వొక్కరికైనా అయిందా?'

'పెద్దది యిదే... దీనికే కాలేదు. కాలం చూస్తే కట్నంతో మండుతావుంది. దేవుడెవరె వరికి రాసి పెట్టున్నాడో... తాగితాగి దీనబ్బకు కాలం సెల్లిపోయింది. గుండెకి సిల్లులు పడ్డా యంట. ఏం జేస్తాం నా ఖర్మ...'

'మా రాముడు బి.యే సదవతా, నాకు ఈ మాయదారి మంచం తోడయ్యేసరికి సాలిచ్చే సిండు. నేనో మాట సెప్తా యినుకో.

మా రావుడికి తోడుగా రావడానికి సుజాత అయితే మంచిగా వుంటుందనిపిస్తోంది. 'ఇప్పటికిప్పుడు చెప్పమనడం లేదు. సుజాతా... బాగా ఆలోచించి చెప్పాకనే నిర్ణయించుకొందాం'.

సుజాత క్షణంసేపు బిత్తరపోయి యెంకటమ్మను చూసింది. రాముడి ముఖంలో వెయ్యి కాండిల్స్ బల్బు వెలిగింది.

శుభస్య శీఘ్రంగా భావించి, నాల్గురోజుల్లోనే సుజాత కోడలుగా వచ్చింది.

ఢిల్లీ, పూనే, కాశ్మీర్‌లలో వుండే కొడుకులు, కూతురికి ఫోన్ ద్వారా విషయం చెప్పమని రాముడికి చెప్పింది.

'మంచంలోంచి కదలకుండానే యింత కథ నడిపిందా? ఏమైనా అసాధ్యురాలు...'

'ఇల్లలకగానే పండుగా... ఆసాంతం ఆ పిల్ల కాపురం చేస్తేగదా...'

'వాడికెందుకో తగలాటకం తగిలించింది! అమ్మకు చాకిరీ చేస్కుంటున్నోణ్ణి చేసుకోనీక...'

'ఏదైనా జరిగి పరువుపోతే గానీ తెల్సిరాదు.

ఆ పిల్ల పసిదాయె...'

'పేదింటిదైనా దాని బతుకుదాన్ని బతకనీ క... ఏందో... ఈ ముసల్ది...'

అలా రకరకాల వ్యాఖ్యానాలు తన చెవినే పడ్డప్పుడు సుజాత చెవిక్కూడా చేరివుంటాయనుకొని సుజాతను పిల్చింది దగ్గరికి.

'రాముడు రాత్రి నీతో మాట్లాడినాడా? ఎట్లా వుండినాడు?'

'అనుకోని వాళ్లు అడగకూడనివి అడిగితే నేనేం చెప్పనమ్మా...' తల దించుకుని రాముణ్ణి సిగ్గుతో చూడ్డంతో గట్టిగా ఊపిరితీస్కుందామె.

కొన్ని సమయాల్లో సిగ్గుపడ్డం కొంత అర్థాన్ని తెల్పుతుంది. మనిషిలో వున్న మంచితనం వొప్పుకోవాలన్నా, గుర్తించాలన్నా పొగడాలన్నా ఎంతో సంస్కారం వుండాలి. సుజాతా... ఇతరులు వేలెత్తి చూపేట్టు కాకుండా మీ కాపురం జరిగిపోవాల... రాముడు మెతక. వాడి బరువూ భారం నీదే... అంటున్న ఆమె మాటలు సుజాతకు అయోమయంగా అన్పించాయి.

మీరు ఆందోళన చెందకండి. భార్యగా నా స్థానాన్ని కాపాడుకొంటాను. మీ ఆశీర్వచనాలుంటే అవే మాకు శ్రీరామరక్షత్తయ్యా...

సుజాత బైటికి పోకుండా కావల్సినవన్నీ రాముడు సమకూరుస్తున్నాడు. తను అమ్మకు చేసే సపర్యల్ని సుజాత అందుకొంది.

ఇరుగు పొరుగు వాళ్లు చెవులు కొరుక్కొనే వాళ్లు.

'కొడుకు గుట్టు విప్పకుండా వుండాలంటే కోడల్ని నెత్తినెట్టుకోవాల...'

'అత్తగారికి సేవలు చేయడానికేనా నేనొచ్చిందనే ప్రశ్న రాకుండా పోదు...'

'ఆ అమ్మాయి అమాయకురాలేంకాదు గుండెమీద తన్ని పోద్ది...'

అలా... సుజాతకు విన్పడేట్టుగా మాట్లాడే వారి మాటలకర్థం రాముణ్ణడిగింది విని, కొడుక్కంటే తనే మాటాడింది ముందుగా.

'అందరి మాటలకూ దూరంగా వుంటే, నీ ఆలోచనతో సవ్యంగా సాగిపోతుంది మీ సంసారం...! ఇంతకంటే వివరంగా చెప్పాల్సిన పని లేదు' అంది అత్తమ్మ.

పదినెలల తర్వాత పండంటి బిడ్డను అందించింది సుజాత. ఆ కుంటుంబాన్ని మంటల మధ్య నిలబెట్టి తమాషా చూద్దామనుకొన్న వాళ్లకూ బారసాల పిలుపు పోయింది.

వచ్చిన వాళ్లంతా అచ్చు రాముడే... అన్నారు. రాముడు సుజాత పాలిట దేవుడు, సుజాత రాముడి పాలిట దేవతయింది... అభాండాలు, ఆక్షేపణలు... ఏవైనా గాలికెగిరే ఎండుటాకులే అయ్యాయి.

'ఏమైనా అత్తగారిలో అమ్మవుండి నన్ను నడిపించింది' అనుకోగానే సుజాత మనసు తృప్తి, గర్వంతో పొంగిపోయి రాముణ్ణి చుట్టేసింది. ●

## రచయితలకు గమనిక

జూన్, 2009 వరకూ మాకు అందిన కథల ఎంపిక పూర్తిచేసి, వివరాలను ఆయా రచయితలకు తెలియజేయడం జరిగింది. ప్రచురణకు స్వీకరించిన రచనలను ఎప్పుడు ప్రచురించేదీ ఆయా రచయితలకు ముందుగా తెలియజేస్తాం.

30 - జూన్, 2009 కి ముందు మాకు చేరిన రచనల గురించి ఎవరికైనా ఇప్పటికీ సమాచారం అందకపోతే మా కార్యాలయానికి (ఉ॥ గం. 9-00 నుంచి సా॥ గం. 6-00 వరకు) 0866 – 6662666 / 6663666 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

– ఎడిటర్